# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE
WORD OF
TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్యమాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J. C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంచిక 2 సెప్టెంబరు 1987 సంపుటి 8

# సంపాదకీయము

## క్రైస్తవ దృక్పధము

## *(The Christian's Perspective)*

క్రైస్తవులు ఎంతో దీవించబడినవారు. అయితే పలుమారులు వారా సంగతిని మరతురు. ఇట్టి సందర్భములో మనము ఇదివరకు ఎక్కడ ఉన్నామో, ఇప్పుడెక్కడ యున్నామో, చివరిగా ఎక్కడ యుంటామో యను దానిని గూర్చి అంచనా వేసుకోవడం అవుసరం.

### గతంలో మనమున్న చోటు

పౌలు పేతురు కూడ తమ కాలంలో యున్న క్రైస్తవులకు యిదివరకు వారెక్కడ ఎట్టి పరిస్థితిలో యుండిరో దానినుండి ఎట్లు విమోచింపబడితిరో వారికి జ్ఞాపకం చేసేవారు. ఎఫెసులోయున్న క్రైస్తవులకు పౌలు ఇట్లు వ్రాసాడు: "కాబట్టి మునుపు శరీరవిషయములో అన్యజనులై యుండి శరీరమందు చేతితో చేయబడిన సున్నతిగలవారు అనబడిన వారిచేత సున్నతి లేనివారనబడిన మీరు ఆ కాలమందు ఇశ్రాయేలుతో సహపౌరులుకాక, పరదేశులును వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణ లేనివారును లోకమందు దేవుడు లేనివారై

యుండి క్రీస్తుకు దూరస్థులైయుంటిరని మీరు జ్ఞాపకము చేసుకొనుడి. అయినను మునుపుదూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులైయున్నారు" (ఎఫెసీ 2:11-13). పేతు రిట్లు వ్రాసాడు: "మనము పోకిరిచేష్టలు దురాశలు మద్యపానము అల్లరితో కూడిన ఆటపాటలు త్రాగుబోతుల విందులు చేయదగని విగ్రహాపూజలు మొదలైన వాటియందు నడుచుకొనుచు అన్యజనుల ఇష్టము నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును. అపరిమిత మైన ఆ దుర్వ్యాపారమునందు తమతో కూడ మీరు పరుగెత్తక పోయినందుకు వారు ఆశ్చర్యపడుచు మిమ్మును దూషించుచున్నారు. సజీవులకును మృతులకును తీర్పుతీర్చుటకు సిద్ధముగా ఉన్నవానికి వారు ఉత్తరవాదులై యున్నారు. మృతులు శరీర విషయములో మానవరీత్యా తీర్పుపొందునట్లును ఆత్మ విషయములో దేవునిబట్టి జీవించు నట్లును వారికి కూడ సువార్త ప్రకటింపబడెను" (1 పేతురు 4 : 3-6). మరల పేతురు తనకాలపు క్రైస్తవుల కిట్లు చెప్పాడు: "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము ఏర్ప రచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు. ఒకప్పుడు ప్రజగా ఉండక ఇప్పుడు దేవుని ప్రజయైతిరి; ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడిన వారై తిరి. ప్రియులారా మీరు పరదేశులును యాత్రి కులునై యున్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించి అన్యజనులు మిమ్మును ఏయే విషయములో దుర్మార్గులని దూషింతురో, ఆ విషయములో వారు మీ సత్ క్రియలను చూచి వాటిని బట్టి దర్శన దినమున దేవుని మహిమపరచునట్లు వారి మధ్యను మంచి ప్రవర్తన గలవారై యుండవలెనని మిమ్మును బతిమాలుకొను చున్నాను" (1 పేతురు 2 : 9-12).

గతంలో వారెట్లుండిరో ఇప్పుడు ఎట్లు మారారో గమనించుము. వారు క్రీస్తునందు విశ్వాసులైనప్పుడు, మారుమనస్సు పొంది ప్రభువుకు లోబడినప్పుడు ప్రభువు వారిని రక్షించాడు, వారిని దేవుని బిడ్డలుగా చేసి శ్రేష్టమైన జీవితాన్నిచ్చాడు. అయితే మన సంగతి యేమిటి? మనం పాపములో యున్నప్పుడు దేవుడు, నిరీక్షణ లేనివారుగా యుంటిమి. అయితే క్రీస్తు సువార్తకు లోబడినప్పుడు ప్రభువు మనల్ని మార్చాడు, రక్షించాడు, నిరీక్షణ నిచ్చాడు.

## ఇప్పుడు మనం ఉన్న చోటు

ఇప్పుడు మనం రక్షించబడి దేవుని బిడ్డలమైతిమి. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధించబడునని" క్రీస్తు చెప్పాడు (మార్కు 16 : 16). "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని పౌలు చెప్పాడు (గల 3 : 27). మనము క్రీస్తునందు, ఆయన శరీరమైన సంఘమందున్నాము. క్షమింపబడి యున్నాము, ఆయన రక్తములో కడుగబడి యున్నాము. పరిశుద్ధాత్మ వరము మన కనుగ్రహింపబడి యున్నది, ఆత్మీయ వరములు నిత్య జీవ నిరీక్షణ కలిగి యున్నాము.

## మనం ఉండబోయే చోటు

చివరిగా దేవునియందు నమ్మకముగా యున్నవారి కొరకు బహుమానమున్నది. దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదని బైబిలు చెప్పుచున్నది (1 కొరింధి 2 : 9). నమ్మకముగా యున్నవారు నీతి కిరీటమును పొందుదురని యాకోబు చెప్పుచున్నాడు (యాకో 1 : 12). మరణ పర్యంతము

నమ్మకముగా యున్నవానికి నిత్య జీవ కిరీట మియ్యబడునని క్రీస్తు చెప్పాడు (ప్రక 2 : 10).

క్రీస్తు వచ్చినప్పుడు ఆయనతో కూడి యుండుటకు కొనిపోబడుదుము (1 థెస్స 4 : 13-18). చివరిగా పరలోకం చేరుకొందుము. అక్కడ దుఃఖమైనను మరణమైనను యుండదు. తండ్రియైన దేవునితో నిత్యము ఉందుము (ప్రక 21 : 4; 22 : 5).

దేవుని బిడ్డల వలె అంతము వరకు నమ్మకముగా యుందాము. ఈ జీవితంలోనే మనం ఎంతో దీవించబడిన వారము. అయితే ఎన్నడు అంతమొందని నిత్యజీవితం మనది కాగలదు. క్రైస్తవులు కానివారిని ప్రభువే ఆహ్వానించుచున్నాడు. దానిని అంగీకరించు వానిదే ఆనందం.

---

## క్రీస్తును ఒప్పుకొనుట
## *( Confession of Christ )*

సువార్తయొక్క మరియొక ఆజ్ఞ క్రీస్తును దేవుని కుమారునిగా ఒప్పుకొనుట. ఒప్పుకొనుట యను మాటకు తెలియపర్చుట, ప్రకటించుట, అంగీకరించినట్లు చెప్పుట, మరియొకరియందలి విశ్వాసమును వ్యక్తపరచుట యని యర్థమిచ్చును. ఆయనను అంగీకరించిన ప్రతివాని నుండి ప్రభువు దీనికై ఎదురు చూచును. యేసుక్రీస్తు దేవుని కుమారుడని తాను నమ్ముచున్నట్లు ఒప్పుకొనుటకు ప్రతివాడు ఇష్టపడవలెను. ఒకడు అట్టి ఒప్పుదల చేయుటకు సంసిద్ధుడు కాని యెడల, అతడు ప్రభువును అంగీకరించుటకు సిద్ధముగా లేడని యర్థము. అట్టి పరిస్థితులలో అతడు ప్రభువును అంగీకరించడు.

క్రీస్తు ఈ ఒప్పుదలయొక్క ప్రాముఖ్యతను ఆయన బోధనలలో చెప్పెను, "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేను వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న

నా తండ్రి యెదుట నేనెరుగనందును" (మత్తయి 10:32, 33). ఇచట కొన్ని సంగతులను మనము గుర్తించుదము :

1. క్రీస్తును ఒప్పుకొనుటకు అందరు ఆహ్వానించబడిరి. వారు ఎవరైనను, ఎక్కడున్నను అది లెక్కలోనిది కాదు గాని ఈ సత్యము మాత్రము నిలుచును.

2. ఈ ఒప్పుదల క్రీస్తును గూర్చి చేయవలసి యున్నది గాని, ఒకని పాపములను గూర్చి మాత్రము కాదు. ఒకని విధేయతనే ప్రప్రథమముగా ప్రభువు కోరుచున్నాడు. ఆ తరువాత వాని పాపములను గూర్చి ఆయన యోచించును.

3. ఈ ఒప్పుదల మనుష్యుల యెదుట చేయవలెను. దీనికి సాక్షు లుండవలెను. ఒకడు క్రీస్తునందు నిజముగా నమ్మిన యెడల అతడు ఆయనయందు తనకున్న విశ్వాసమును ప్రతివానికి తెలియవలెనని కోరును.

4. క్రీస్తును అట్లు ఒప్పుకొనిన వానిని గూర్చియే పరలోక మందున్న తండ్రి యెదుట ప్రభువు ఒప్పుకొందునని వాగ్దానము చేసెను. తన పరలోకపు తండ్రి యెదుట దేవుని కుమారుడు ఒప్పు కొను దీవెన, గౌరవమును గురించి ఆలోచించుము! ప్రభువు ఏమి అడుగును? మనుష్యుల యెదుట తనను ఒప్పుకొనుమని అడుగును.

5. మనుష్యుల యెదుట ఆయనను ఒప్పుకొననివాడు పరలోకపు తండ్రి యెదుట నిరాకరించబడును. ఆయనను ఒప్పుకొనక పోవుట ఆయనను తృణీకరించుటయే. ప్రభువు కూడా ఆలాగునే వారి యెడల చేయును. వారు ఎవరైనను, ఎక్కడి వారైనను ఇది అందరకు వర్తించును.

కావున లేఖనములలోని ఈ చిన్న రెండు వాక్యములలో ఎంతయో చెప్పబడినది. ప్రభువు ఇరుపక్షములను చూపించెను, దీవె

నలు మరియు ఆయనను నిరాకరించు వారికి కలుగు పరిణామములు. ఆయన ప్రతి వ్యక్తికి ఎవరి నిర్ణయము వారికే వదలివేసెను.

ప్రభువును ఒప్పుకొననివారి సంగతి ఏమి? అపొస్తలుడైన యోహాను చెప్పెను, "యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యొప్పుకొనని అనేక వంచకులు (మనలోనుండి) వెళ్ళిపోయి లోకమందున్నారు. అట్టివాడే వంచకుడును, క్రీస్తు విరోధియునై యున్నాడు" (2 యోహాను 7). ఎవరు ఒప్పుకొనవలెనో పౌలు వ్రాసెను, "ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును......" (ఫిలిప్పి 2 : 11).

## రక్షణ కొరకు ఒప్పుకోలు

ఈతరువాత, ఒప్పుకోలు నోటితో చేయుట మాత్రమే కాక, రక్షించబడుటకొరకు చేయవలెనని మనము గ్రహింతుము: "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:9, 10). రక్షించబడుటకు ఒకడు తన పాపములను ఒప్పుకొని ప్రభువును అంగీకరించిన చాలునని కొందరు తప్పుగా అర్థము చెప్పిరి. మరి విశ్వాసము సంగతి ఏమి? కాని ఒప్పుదల విశ్వాసముపై ఆధారపడినదని ఒకడు ప్రమాణము చేయును. మరి మారు మనస్సు సంగతి ఏమి? ఇచట మారుమనస్సు గూర్చి ఏమియు చెప్పబడలేదు. తేలిక మార్గమును అన్వేషించువారు చాలా విషయములను మరతురు. కాని ఆ తరువాత వచనమే క్రీస్తునందు విశ్వాసము. ఒప్పుకోలు రక్షణ మార్గములో ఎట్లు అమరి యున్నదో చూపించుచున్నది. మొదటిగా ఒకడు తప్పక తన మనసునందు నమ్మిక యుంచినట్లు కనుపరచవలెను. కాని ఇది నీతిలోనికి లేదా రక్షణలోనికి అనగా ఒకడు రక్షించబడలేదు కాని

రక్షణకొరకు ఎదురు చూచుచున్నాడు. రెండవదిగా రక్షణకొరకు నోటితో ఒప్పుకొనినల్లు చూపించుచున్నాడు. మరియొక విధముగా చెప్పవలెననిన, క్రీస్తునందు విశ్వాసము, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకోలు, ఇవి మాత్రమే రక్షణను కలుగజేయవు. ఒకడు విశ్వాసము, ఒప్పుకోలు లేకుండ రక్షించబడలేడు కాని ఇంకనూ చేయవలసినవి యున్నవి.

## ఒక ఉదాహరణ

ఆఖరుగా బాప్తిస్మమునకు అర్హునిగా చేయుటకు ఒక మనుష్యుడు ఒప్పుకొనిన యుదంతము మనకు కలదు. మనము ఆసంఘటనను చదువుదము. "ప్రభువు దూత-నీవు లేచి, దక్షిణముగా వెళ్లి, యెరూషలేమునుండి గాజాకు పోవు అరణ్య మార్గమును కలసికొమ్మని ఫిలిప్పుతో చెప్పగా అతడు లేచి వెళ్లెను. అప్పుడు ఐతియొపీయుల రాణియైన కందాకే క్రింద మంత్రియై ఆమెయొక్క ధనాగారమంతటి మీదనున్న ఐతియొపీయుడైన నపుంసకుడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చి యుండెను. అతడు తిరిగి వెళ్లుచు, తన రథముమీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండెను. అప్పుడు ఆత్మ ఫిలిప్పుతో-నీవు ఆ రథము దగ్గరకుపోయి దానిని కలిసికొనుమని చెప్పెను. ఫిలిప్పు దగ్గరకు పరుగెత్తుకొనిపోయి అతడు ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండగా విని-నీవు చదువునది గ్రహించుచున్నావా ? అని అడుగగా అతడు ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని చెప్పి, రథమెక్కి తనతో కూర్చుండుమని ఫిలిప్పును వేడుకొనెను. అతడు లేఖనమందు చదువుచున్న భాగమేదనగా - ఆయన గొర్రెవలె వధకు తేబడెను. బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెపిల్ల ఏలాగు మౌనముగా ఉండునో ఆలాగే ఆయన నోరు తెరువకుండెను. ఆయన దీనత్వమును బట్టి ఆయనకు న్యాయవిమర్శ దొరకకపోయెను. ఆయన సంతానము ఎవరు వివ

రింతురు? ఆయన జీవము భూమిమీద నుండి తీసివేయబడినది — అప్పుడు నపుంసకుడు - ప్రవక్త యెవనిని గూర్చి యీలాగు చెప్పుచున్నాడు? తన్ను గూర్చియా, వేరొకని గూర్చియా? దయచేసి నాకు తెలుపుమని ఫిలిప్పు నడిగెను. అందుకు ఫిలిప్పు నోరు తెరచి, ఆ లేఖనమును అనుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను. వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్ళున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు—ఇదిగో నీళ్లు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరు నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను. వారు నీళ్ళలోనుండి వెడలి వచ్చినప్పుడు ప్రభువు ఆత్మ ఫిలిప్పును కొనిపోయెను, నపుంసకుడు సంతోషించుచు తన త్రోవను వెళ్లెను; అతడు ఫిలిప్పును మరి యెన్నడును చూడలేదు" (అ.కా. 8 : 26-39). ఇక్కడ జరిగినది విపులముగా యున్నది. ఫిలిప్పు ఈ మనుష్యునికి క్రీస్తును గూర్చి బోధించి ఆయనను అంగీకరించుటకు అతడేమి చేయవలెనో చెప్పెను. ప్రభువును గూర్చి తెలిసికొనిన తరువాత ఆయన చిత్త ప్రకారము చేయవలెనని అతడు వాంఛించెను. బాప్తిస్మము ఇచ్చుటకు ముందు యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముచున్నావా యని ఫిలిప్పు తెలిసికొనగోరుట గుర్తించుము. నపుంసకుడు ఒప్పుకొనిన తరువాత ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చుటకంగీకరించెను.

ఈ ఉదాహరణ ప్రాతిపదికగాను, క్రీస్తును ఒప్పుకొనుటను గూర్చిన లేఖనములలోని యితర వాక్యముల ఆధారముతోను, బాప్తిస్మమిచ్చుటకు పూర్వము ఒకనిని యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముచున్నావా యని మనము అడుగుదుము. ఒకసారి అతడు ఔనని సమాధాన మిచ్చిన యెడల మనము అతనికి బాప్తిస్మమిచ్చుటకు ఉపక్రమింతుము.

ఈ ఒప్పుకోలు మంచి ఒప్పుకోలుగా తరచు చెప్పబడెను. నిజముగా ఏ ఒప్పుకోలునైనను మంచి ఒప్పుకోలు అనిన అది ఇదియే.

కనుక మనకేమి కలదు? ఒకడు రక్షించబడవలెననిన, అతడు సువార్తను వినవలెను, దానిని నమ్మవలెను, తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనవలెను, ఆఖరుగా తన పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. ఇక్కడ క్రీస్తును ఒప్పుకొనుట రక్షణ ప్రణాళికలో ఒక భాగము మాత్రమే లేక సువార్తలోని ఒక ఆజ్ఞయే. ఇది ఒక్కటి మాత్రమే ఎవరిని రక్షించలేదు, ఇది లేకుండగ ఎవడును రక్షించబడడు. ఇది ప్రభువు ఏర్పరచిన స్థితిలో యున్నప్పుడు ప్రాముఖ్యమైనదిగాను, శక్తివంతమైనదిగాను యగుచున్నది.

—జె. సి. ఛోట్.

---

## దేవుడు
## (*God*)

ప్రపంచములో నున్న ప్రజలందరు దేవుడున్నాడని ఒప్పుకొందురు. ప్రపంచమునకు దేవుని అవసరత ఎంతైనా ఉన్నది అయితే జనులు దేవునిని గూర్చి సరిగా తెలిసికొనుటలేదు. "ఇశ్రాయేలు వారలారా యెహోవా మాట ఆలకించుడి- సత్యమును, కనికరమును, దేవుని గూర్చిన జ్ఞానమును దేశమందు లేకపోవుట చూచి యెహోవా దేశ నివాసులతో వ్యాజ్యమాడు చున్నాడు" (హోషేయ 4:1).

దేవునిని గూర్చిన జ్ఞానము కొందరికి లేదు (1 కొరింథీ 15:34). "ఎందుకనగా దేవుని గూర్చి తెలియ శక్యమైనదేదో అదివారి మధ్య విశదమైయున్నది. దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్య

లక్షణములు, అనగా ఆయన నిత్య శక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు (రోమా 1:19, 20). దేవుని జ్ఞానాను సారముగా - లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరుగ కుండినందున - సువార్త ప్రకటన యను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్ప మాయెను (1 కొరిం 1:21). అనగా మానవుడు దేవుని తెలిసికొనుటకు దేవుడు తన్ను తానే బయలు పరచుకొనెను. దేవుని వాక్యమైన బైబిలు గ్రంథము దేవుని ప్రత్యక్షతయై యున్నది. మానవుడు తన్ను సృజించిన సృష్టి కర్తయైన దేవుని గూర్చిన జ్ఞానమును బైబిలు గ్రంథమును చదివి పొందగలడు. "అద్వితీయ సత్య దేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" (యోహాను 17:3).

"అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలోను ఉన్నాడు" (ఎఫెసీ 4:6). దేవుడు పరలోకమందున్న తండ్రి (మత్తయి 6 : 9). 'దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. దేవుని స్వరూపమందు వాని సృజించెను. స్త్రీనిగాను, పురుషునిగాను వారిని సృజించెను' (ఆది 1 : 27). దేవుడు మానవులందరికి తండ్రి. ఆయన మానవులను సృజించెను. దేవుడు మన తండ్రి.

దేవుడు వ్యక్తిత్వము గలవాడై యున్నాడు. "చెవులు కలుగ జేసినవాడు వినకుండునా ? కంటిని నిర్మించినవాడు కానకుండునా ?" (కీర్త 94 : 9). 'మరియు యెహోవా ఇట్లనెను—నేను ఐగుప్తులోనున్న నా ప్రజల బాధను నిశ్చయముగా చూచితిని. ప్రజలలో తమ్ము కష్ట పెట్టువారిని బట్టి వారు పెట్టిన మొర వింటిని. వారి దుఃఖము నాకు తెలిసియే యున్నది (నిర్గమ 3 : 7). వినగల దేవుడు, తెలిసికొనగల దేవుడు, ప్రేమగల దేవుడు (యోహా 3 : 16), రోషముగల దేవుడు

(నిర్గమ 20 : 5), కోపముగల దేవుడు (సంఖ్యా. కాం. 22 : 22). మాట్లాడు దేవుడు. దేవుడు ఒక వ్యక్తి. ఆయనకు వ్యక్తికి గల అన్ని లక్షణములు గలవు.

## దేవుని పేర్లు

ఈ పేర్లను దేవుడే తన్ను గూర్చి బయలుపరచుకొన్న పేర్లు. ఈ పేర్లు ఆయన స్వభావమును మనకు వివరించునట్లు దేవుడు బయలు పరచిన పేర్లు. ఆయన గొప్ప పేర్లలో ఆయన గొప్ప శక్తిని చూడ గలము.

1. యెహోవా : దేవుడు మోషేతో ఇట్లనెను - 'నేనే యెహో వాను' (నిర్గమ 6 : 3). హెబ్రీ భాషలో దేవుని పేరు 'యాహ్వే' అని మాత్రమే వారు పిలిచెడివారు. పూర్తి పేరు పిలుచుటకు భయపడిరి.

2. సర్వశక్తిగల దేవుడు : 'నేను సర్వశక్తిగల దేవుడను. నా సన్నిధిలో నడుచుచు నిందారహితుడవై యుండుము' (ఆది 17 : 1). దేవుడు అబ్రాహాముతో చెప్పిన తన పేరు.

3. భయంకరుడైన మహాదేవుడు : 'నీ దేవుడైన యెహోవా నీ మధ్య నున్నాడు. ఆయన భయంకరుడైన మహాదేవుడు' (ద్వితీ 7 : 21).

4. మహోన్నతుడు : 'యెహోవా మహోన్నతుడు, భయంక రుడు, ఆయన సర్వభూమికి రాజై యున్నాడు' (కీర్త 47 : 2).

5. 'శాశ్వతుడైన దేవుడు నీకు నివాస స్థలము; నిత్యముగ నుండు బాహువులు నీ క్రింద నుండును' (ద్వితీ 33:27).

6. యెహోవా పరిశుద్ధుడు : 'యెహోవా పరిశుద్ధుడు. ఆయన మీ అపరాధములను, పాపములను, పరిహరింపనివాడు. మీ రాయనను సేవింపలేరు' (యెహోషువ 24 : 19; లేవీ 11 : 44; 19:2).

7. జీవముగల దేవుడు : 'మనుష్యులందరికి రక్షకుడనైన జీవముగల దేవుని యందు మనము నిరీక్షణ యుంచి యున్నాము. గనుక...... పాటుపడుచున్నాము (1 తిమో 4 : 10).

8. కనికరముగల దేవుడు : 'నీ దేవుడైన యెహోవా కనికరముగల దేవుడు. నిన్ను చెయ్యి విడువడు. నిన్ను నాశనము చేయడు .... నిబంధనను మరచిపోడు, (ద్వితీ 4 : 31).

9. రోషము గల దేవుడు : 'ఏలయనగా నీ దేవుడనైన యెహోవా అను నేను రోషము గల దేవుడను' (నిర్గమ 20 : 5).

10. సైన్యముల కధిపతి యగు దేవుడు : 'యెహోవా, ప్రభువా, సైన్యముల కధిపతియగు యెహోవా అను పేరు వహించువాడా, శూరుడా నీ అధిక బలము చేతను, చాచిన బాహువు చేతను భూమ్యాకాశములను సృజించితివి, నీకు అసాధ్యమైనదేదియు లేదు (యిర్మీయా 32:17; కీర్త 80:14).

11. చూచుచున్న దేవుడు : (ఆది 16 : 13)

12. ఉండుననువాడు : నేను ఉన్నవాడను, అనువాడనై యున్నానని (దేవుడు) మోషేతో చెప్పెను (నిర్గమ 3:14).

ఈ పేర్లు ఆయన స్వభావమును తెలియజేయును. గాని ఆయన ఒకడే దేవుడు అద్వితీయుడు. గ్రీకులు 30,000 మంది దేవుండ్లున్నారని నమ్మెదరు. హిందువులకు 3 కోట్ల దేవతలు గలరని అందురు. ఒక్కొక్క దేవత, దేవుడు ఒక్కొక్కనికి సహాయ పడుదురని వారి నమ్మకము. దేవుని గూర్చిన జ్ఞానము సరియైనది కాకపోవుట విచారకరము. బైబిలునందు దేవుడు తన్ను తాను లోకమునకు బయలుపరచుకొనెను. మానవుడు దేవునిని గ్రహించునట్లు దేవుడు తన ప్రత్యక్షతననుగ్రహించెను.

— పి. ప్రకాశము, హైదరాబాదు.

## ఆదాము
## *(Adam)*

ఆదిమానవుడు ఆదాము. అతని జన్మ చిత్రవిచిత్రమైనది. ఎవరి గర్భమున అతడు పుట్టలేదు, ఏ తల్లి పాలు త్రాగలేదు, ఏ మహానగరములోను పుట్టలేదు, ఏతూగు టుయ్యాలలోను ఊగలేదు. మానవ జన్మకు అతీతంగా తల్లి, తండ్రి లేకుండా జన్మించాడు.

ఆదాము మానవ ప్రపంచానికే ప్రథముడు, ప్రథమ పురుషుడు, ప్రథమ వ్యవసాయకుడు, ప్రథమ భర్త, ప్రథమ శాపగ్రస్తుడు కూడా. సృష్టి నిర్మాణం ఒక ఎత్తు, ఆదాము నిర్మాణం ఒక ఎత్తు. సృష్టిలోని ప్రతి వస్తువు, సమస్తమును "కలుగునుగాక" అని దేవుడు పలుకగానే అవి కలిగెను. సూర్య, చంద్ర, నక్షత్రాదులు, పశువులు, పక్షులు, జలములు, చెట్లు మొ॥నవి దేవుని వాక్శక్తితో కలిగాయిగాని ఆదాము దైవ హస్తములతో నిర్మింపబడినవాడు. మానవ రక్త మాంసేచ్ఛల ద్వారా అతడు కలుగలేదు. నేలమంటితో దేవుడు ఆదామును సృజించెను. అతని నాసికా రంధ్రములలో దేవుడు జీవ వాయువును ఊదగా అతడు జీవించు ఆత్మ ఆయెను. ఆదాము జన్మతా పాప రహితుడుగా సృజింపబడెను.

ఆదాము దేవునితో సహవాసం కలిగియున్నాడు. దేవునితో మాట్లాడెడివాడు. దేవుడు అతని కిచ్చిన ఏదెను వనములో యథేచ్ఛగా తిరిగెడివాడు. ఆ వనములోని తోలి పండ్లను తిని జీవించాడు. జీవ వృక్ష ఫలములను తింటూ జీవించుచుండెను. కాని తోట మధ్యన ఉన్న మంచి చెడ్డల తెలివి నిచ్చు వృక్ష ఫలమును తినరాదని దేవుడు ఆజ్ఞ ఇచ్చెను. ఇది ఒక్కటే దేవుడు ఆదాముకు ఇచ్చిన హెచ్చరిక.

ఆదాము జ్ఞానవంతుడు. ఈజ్ఞానం దేవునివలననే కలిగినది. నీతి, పరిశుద్ధత, జ్ఞానము అను దేవుని పోలిక ఆదామునకు ఇయ్యబడెను. ఆ జ్ఞానంతో సర్వ జీవకోటికి పేర్లు పెట్టెను. ఆదాము పెట్టిన ఆ పేర్లతోనే మనము నేటికి పిలుచుచున్నాము. అసంఖ్యాకమైన జీవరాశి

మధ్య అతడు సంచరించు చున్నప్పటికి అతడు ఏకాకి గానే జీవించు చున్నాడు. దేవుడు అతని ఏకాంత స్థితిని చూచి జాలిపడినాడు. అతనికి గాఢ నిద్ర కలుగజేసి అతని ప్రక్క-టెముకను తీసి దానితో ఒక స్త్రీని సృజించెను. ఆదామునకు ఆమెను సాటియైన సహాయంగా, కష్ట సుఖాలలో సమభాగినిగా అనుగ్రహించెను. దేవుడు ఆదామునకు ఇచ్చిన బహుమతి ఈ స్త్రీ. ఆదాము ఆమెకు హవ్వ అని పేరు పెట్టెను.

ఆదాము, హవ్వలు ఎంతో ఆనందంగా ఒకరినొకరు అన్యోన్య సహవాసము గలిగినవారై దేవునితో మాట్లాడుచూ, ఆయన ఇచ్చిన ఆజ్ఞను పాటిస్తు ఆనందంగా ఉండసాగినారు. ఈ ఆనందము దేవుని శత్రువు అయిన అపవాదికి ఈర్ష్యజనింప చేసినది. అప్పటి నుండి సాతాను సృష్టి పతనానికి పథకాలు వేసాడు. కాని అవి ఫలించలేదు. సుదీర్ఘంగా ఆలోచించాడు. అబల హవ్వను సమీపించాడు. ఆడది ఆశాబానిస. సర్పనాయకుని మాటలతో హవ్వ మోసంలో పడింది. నిషిద్ధమైన పండ్లను తాను తిని తన భర్తకు ఇచ్చింది. దానితో వాళ్ళు పతన మయ్యారు. సిగ్గు తెలిసింది. ఏదెను వనము వారికి దూరమయ్యింది. శపింపబడ్డారు. దేవుని ప్రేమకు, సహవాసానికి దూరమయ్యారు. వారి పాపఫలితంగా కష్టపడి చెమటోడ్చి ఆహారం సంపాదించుకొనవలసి వచ్చింది. వారి ప్రథమ పుత్రుడు కయీను. ఇతడు నరహంతకుడు. ప్రథమ హత్య ఆదాము కుటుంబములోనే జరిగింది. అయితే దేవుడు మానవుని విడిచి పెట్టలేదు. అతనికి రక్షణ ఇవ్వవలెనని తలంచాడు. ఆదాముకు దేవుడు వాగ్దానం చేసాడు. అదేమనగా చీకటి జీవితమును వెలిగించునది, దివ్యజ్యోతి అయిన క్రీస్తు నుద్దేశించినవి. ఏదెనువనములో ఆదాము మడిమను కరచిన సర్పము యొక్క (సాతాను) శిరస్సును క్రీస్తు తన మరణమునుండి పునరుత్థానుడగుటద్వారా చితకగొట్టాడు.

మొదట ఆదాము ద్వారా పాపము లోకములోనికి రాగా కడ పటి ఆదాము ద్వారా అనగా క్రీస్తు ద్వారా లోకమునకు గొప్ప

రక్షణ వచ్చినది (1 కొరి 15:21, 22). ఆదాము చేసిన పాపము సర్వ మానవులకు వ్యాపించింది (రోమా 4:12); అయితే క్రీస్తు యేసు అను రెండవ ఆదాముద్వారా మన పాపములు పోవుచున్నవి (రోమా 5:15).

ఆదాము జీవితం అనేక మలుపులు తిరిగి కర్తవ్య ప్రబోధము చేసినది. దేవుని ఆజ్ఞను అతిక్రమించినవారు పాపులగుదురు. పాపుల అంతము మరణమే (1 యోహా 3:4). ఆదాము తొమ్మిది వందల ముప్పది యేండ్లు బ్రతికి మరణించాడు.

— దేవరపల్లి అబ్రహాము, నడిపూడి.

---

సంక్షిప్త ప్రసంగము:

## క్రైస్తవుడను నామము ధరించుట

## *(Wearing the Name Christian)*

1 పేతురు 4:16

**పరిచయము:**

1. "క్రైస్తవుడు" అను పేరు నూతన నిబంధన గ్రంథములో 3 సార్లు కనబడుచున్నది (అ.కా. 11:26; 26:28; 1 పేతురు 4:16).

2. మత శాఖలవారు ఈ నామమును ధరించియున్నారు. కాని ఇది క్రీస్తుయొక్క ప్రార్థనకు వ్యతిరేకముగా యున్నది (యోహాను 17:20); పౌలుయొక్క వాదన (1 కొరింథి 1:10); పౌలుయొక్క సూచన (ఎఫెసీ 4:4-6).

3. ఈ పాఠము మతశాఖలకు చెందని క్రైస్తవులకు. క్రీస్తు సంఘమునకు ఇది ఉద్దేశించబడినది.

(a) "క్రైస్తవుడు" అను ఒక్క పేరు మాత్రమే సరియైనదని మనకు తెలియును. కాని దాని ధరించుటలో పూర్తి అంతరార్థము

చాల మందికి తెలియదు. మనమందరమును దానిని ధరించుచున్నాము గాని కొందరు సరిగా ధరించుటలేదు.

(b) బాప్తిస్మము పొందిన క్రైస్తవునికన్న, సంఘ సభ్యునికన్న, వారపు ఆరాధికునికన్న క్రైస్తవుడు మిన్న. ఇటువంటివారు చాలామంది యున్నారు కాని క్రైస్తవులు కొద్దిమంది మాత్రమే.

**ముఖ్యాంశములు :-**

I క్రైస్తవుడను నామము ధరించుటలోని యర్థము :

A. క్రైస్తవ నామము ధరించుట ఘనత :

1. సాధారణముగా పేరులకు మర్యాద, అమర్యాద చేకూర్చబడి యుంటుంది.

(a) అమర్యాదకరమైన లేక తక్కువగా చూడబడే పేరులకు ఉదాహరణ :- అన్యులు, సమరయులు, నజరేయులు మొదలగునవి.

(b) మర్యాదకరమైన పేర్లు : భర్త, అమెరికావారు, భారతీయుడు, ఆంధ్రుడు, తెలంగాణావాడు.

2. క్రైస్తవుడను నామము అన్ని పేర్ల కంటెను బహు గొప్పదియు, ఖ్యాతి చెందినదియునైన నామము.

(a) యెషయా 56:5; 62:2 "శ్రేష్టమగు నామము ఆదరించునిలను, శ్రేష్టమగు నామము మోక్షసౌఖ్య మద్దియే".

(b) ఆది క్రైస్తవులు ఈ నామమును ధరించుటకు అతిశయపడిరి (1 పేతురు 4 : 16; అ.కా. 5 : 41).

(c) ఒక చట్టప్రకారమైన నామమును, మనుష్య నామమును దేవదూత నామమును ధరించుటలేదు. కాని దేవుని కుమారుని యొక్క నామమును ధరించు

చున్నాము. దానియందు మనము మహిమపర్చబడు
చున్నాము (గలతీ 6 : 14).

B క్రైస్తవ నామము ధరించుటవలన బహుమానము :

1. కనికరముగల తండ్రియొక్క దీవెనలు క్రైస్తవునికి చెందును.

(a) జీవితములోని ఇహసంబంధమైన దీవెనలు : మత్తయి 6 : 33; 7 : 11; యాకోబు 1 : 17.

(b) అవి విలువైన ఆత్మీయ ఆశీర్వాదములు ప్రత్యేకముగా క్రైస్తవునివే (ఎఫెసీ 1 : 3). పాపక్షమాపణ, పరిశుద్ధాత్మ, ప్రార్థన.

2. పరలోకమును గురించిన వాగ్దానములు క్రైస్తవులకు మాత్రమే ఈయబడినవి.

(a) అవిశ్వాసులకు కాదు (యోహాను 8 : 24); అవిధేయులకు కాదు (2 థెస్స 1 : 8).

(b) పరలోకము సిద్ధపడు జనులకు సిద్ధపరచబడిన ప్రదేశము (యోహాను 14 : 3). క్రైస్తవులు మాత్రమే పరలోకము కొరకు సిద్ధపడుచున్నారు.

C. క్రైస్తవుడు అను నామమును ధరించుటయొక్క బాధ్యత.

1. గౌరవప్రదమైనదియు, ఆశీర్వాదకరమైనదియునైన నామమును ధరించుట బాధ్యతను తెచ్చును. ఉదా : భారతీయుడు అను నామమును ధరించిన భారతీయ రాజ్యాంగ చట్టమునందు విశ్వాస ముంచవలెను, ప్రజారాజ్య పద్ధతిని అభ్యాసము చేయవలెను, దేశభక్తుడుగా యుండవలెను, మంచి పౌరుడుగా జీవించవలెను.

2. క్రైస్తవుడు అను నామమును ధరించిన ఈ బాధ్యతలను

చేపట్టుచున్నాము : శిష్యుడుగా జ్ఞానమును గ్రహించుట; వెంబడించు వానిగా ఆయనను అనుసరించుట; దేవుని బిడ్డగా విధేయుడై యుండుట; సేవకునిగా భక్తి శ్రద్ధలు కలిగి యుండుట.

3. క్రైస్తవ జీవితము బాధ్యతతో కూడిన జీవితము (ప్రసంగి 12 : 13; లూకా 17 : 10.)

II క్రైస్తవునిగా యుండుటకును, క్రైస్తవనామము ధరించు కొనుట కును గల తారతమ్యము.

A బైబిలు గ్రంథము వివిధములైన క్రైస్తవులను గురించి చెప్పు చున్నది. ఇందు అధిక తేడాలున్న వారి మధ్య అనేక మెట్లు (Degrees) రంగులు యున్నవి.

1. బలవంతుడు, బలహీనుడు - రోమా 15 : 1.
2. ఆత్మీయమైన, శారీరకమైన - 1 కొరింథి 3 : 1.
3. వెచ్చని, చల్లని - ప్రకటన 3 : 15.
4. స్థిరులు, అస్థిరులు - ఎఫెసీ 4 : 14-16.
5. కేంద్రీకృతము - చుట్టు యుండుట - మత్తయి 26 : 58.

B. ఇట్టి వివిధ క్రైస్తవులను గురించిన సత్యములు :— మొదటి వారు క్రైస్తవ నామమును మంచిగా ధరింతురు, రెండవ వారు చెడుగా ధరింతురు. మొదటివారు దేవునికి మహిమకర ముగా నుందురు, రెండవవారు నింద తెచ్చువారై యుందురు; మొదటివారు పూర్తిగా మారినవారు, రెండవవారు సగము లేక పూర్తిగా మారనివారు; మొదటివారు పరలోకమునకు వెళ్ళుచున్నారు, రెండవవారు నరకమునకు పోవుచున్నారు.

C. నేను క్రైస్తవుడనా లేక నామము మాత్రమే కలవాడనా యని ఎట్లు నిర్ణయించగలము ?

1. నమ్మిక వలన క్రైస్తవుడనైతినా లేక వీలును బట్టియా ? కుటుంబము గురించి లేక గౌరవము గురించి అయితే నేను వట్టి నామమును ధరించువాడనే.

2. నా యొక్క పునఃసృష్టిలో, భాషలో, సారస్వతములో నేను లోకమునుండి వేరైయున్నానా ? నేను త్రాగుచు, నాట్యమాడుచు, తిట్టుచు, జూదమాడుచు యున్న యెడల నేను వట్టి పేరు ధరించినవాడనే.

3. నేను సంఘము యెడల భక్తిశ్రద్ధలు కల్గియున్నానా ? అది నాకు ప్రథమముగా యున్నదా లేక ద్వితీయముగా యున్నదా (మత్తయి 6:33). నేను సహోదరులను ప్రేమించుచున్నానా లేక వారికొరకు నాకు సమయము లేదా ? (యోహాను 13:34). నేను ఎక్కువ ఆరాధనలకు హాజరగుచున్నానా లేక తక్కువ వాటికా ? నేను ధారాళముగా యిచ్చుచున్నానా లేక లోభివలె యిచ్చుచున్నానా ? నేను మొదటి గుంపులో యున్నానా లేక రెండవ గుంపులో యున్నానా ? నేను మొదటి గుంపులో యున్న క్రైస్తవుడను; లేనియెడల నేను నామమాత్రపువాడనే.

4. నేను గట్టి ప్రసంగమును అభినందించుదునా లేక సత్యమును తప్పులను స్పష్టముగా విమర్శి చెప్పునపుడు నేను వ్యసనపడుచుంటినా ? (గలతీ 4:16; యోహాను 6:66.)

5. నేను క్రైస్తవ కృపలలో (2 పేతురు 1:5), జ్ఞానము నందు (2 పేతురు 3 : 18) పెరుగుచుంటినా లేక క్రైస్తవ పెరుగుదల యెడల నిర్లక్ష్యముతో యున్నానా ?

6. అవకాశములను బట్టి, నిర్వాహణశక్తిని బట్టి నేను తప్పిపోయిన వారిని రక్షించుటకు ప్రయత్నించుచున్నానా లేక

యితరులకు క్రీస్తును గురించి చెప్పుటకు ప్రయత్నించు చుంటినా? నేను ఆత్మలను రక్షించువాడను కాకపోయిన యెడల నేను నిజమైన క్రైస్తవుడను కానేరను.

III క్రైస్తవుడను పేరు ధరించుటను గురించిన మూడు సత్యములు :

A. దానిని అంగీకారముతోనే ధరించుచున్నాము. క్రీస్తు దానిని ధరించమని ఒత్తిడి చేయలేదు. కావున ఆయనను సంతోషముతోను, ఇష్టముతోను సేవించవలెను (2 కొరింథి 12:15).

B. దానిని ఎల్లప్పుడు ధరించుచున్నాము. మనము ఎక్కడకు వెళ్ళినా, ఏమి చేసినా క్రైస్తవుడను నామమును ధరించి యున్నాము. దీనిని తీసివేసికొని మరల ధరించలేము. క్రైస్తవత్వము దినదినము ఘడియ ఘడియకు యున్న విషయము (లూకా 9 : 23; మత్తయి 24 : 44).

C. దానిని జ్ఞానయుక్తముగా ధరించవలెను. మన ప్రాబల్యము యితరులపై నున్నదనియు (మత్తయి 5 : 13-16) ఆఖరి తీర్పును గుర్తించుకొని యున్నామనియు (2 కొరింథి 5:10) నిత్య తలంపులతో క్రైస్తవుడను నామమును ధరించవలెను.

ముగింపు :

1. మనము క్రైస్తవులమా లేక నామమును మాత్రమే ధరించిన వారమా?

2. నామము ధరించిన వారందరు పరలోకమునకు వెళ్ళలేరు కాని ఎవరు ఆ పేరుకు తగ్గ జీవించుటకు ప్రయత్నించుదురో వారే పరలోకమునకు వెళ్ళగలరు.

3. దేనిలో నేను మంచి క్రైస్తవునిగా యున్నాను అని మనకు మనము పరిశోధించుకొందము.

★

—E. W. క్లెవెంజర్

# పది యాజ్ఞలు

## *(The Ten Commandments)*

పాత నిబంధనలోని పది యాజ్ఞలను ఇంచుమించు మన మందరము వినియే యుందుము. ఆ పది ఆజ్ఞలను అందరు వల్లించ లేక పోవచ్చును గాని వాటిని గూర్చి వినని వారు సాధారణంగా ఉండరు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వమునుండి బయలుదేరిన మూడవ నెల ఆరంభ దినమందే వారు సీనాయి ఆరణ్యమునకు వచ్చారు (నిర్గమ 19:1). వారు సీనాయి పర్వతము ఎదుట బసచేసారు. మోషే దేవుని యొద్దకు ఎక్కి పోవగా దేవుడు వారిని ఐగుప్తునుండి ఎట్లు విడిపించెనో అతనికి జ్ఞాపకము చేసాడు. "కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచిన యెడల మీరు సమస్త దేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. మీరు నాకు యాజకరూపమైన రాజ్యముగాను, పరిశుద్ధ జనముగాను ఉందురని" ఇశ్రాయేలీయులతో పలుకవలెనని ఆయన చెప్పాడు. మోషే వచ్చి ప్రజల పెద్దలను పిలిపించి యెహోవా తన కాజ్ఞాపించిన ఆ మాట లన్నియు వారి యెదుట తెలియపరచాడు. అందుకు ప్రజలందరు యెహోవా చెప్పిన దంతయు చేసెదమని ఏకముగా ఉత్తరమిచ్చారు (నిర్గ 19 : 3-7).

## మధ్యవర్తి మోషే

మోషే ప్రజల మాటలను దేవునితో చెప్పాడు. అందుకు దేవుడు ప్రజలు తమ్మును తాము పరిశుద్ధపరచుకొని, తమ బట్టలు ఉతుకుకొని మూడవనాటికి సిద్ధముగా యుండాలని చెప్పాడు. ఏల యనగా మూడవనాడు యెహోవా ప్రజలందరి కన్నుల ఎదుట సీనాయి పర్వతము మీదికి దిగి వచ్చును. ప్రజలు మోషే మాటలు విని నడుచుకొనునట్లు వారు దేవుని స్వరము వినాలని దేవుడు కోరాడు.

ప్రజలు పర్వతమును ముట్టకుండునట్లు మేరను ఏర్పరచి ఆ పర్వతమును ముట్టు ప్రతివానికి మరణ శిక్ష తప్పక విధింపబడునని ఆయన చెప్పాడు.

మూడవనాడు వాగ్దానము చేసినట్లే యెహోవా అగ్నితో సీనాయి పర్వతము మీదికి దిగివచ్చెను; పర్వత మంతయు మిక్కిలి కంపించెను. ఆ పర్వతము మీద ఉరుములు మెరుపులు సాంద్ర మేఘము బూరయొక్క మహాధ్వని కలుగగా ప్రజలందరు వణకిరి. యెహోవా పర్వత శిఖరము మీదికి రమ్మని మోషేను పిలిచి ప్రజలు హద్దు మీరి రాకుండునట్లు వారిని మరల హెచ్చరించు మనెను. యెహోవా యొద్దకు చేరు యాజకులు కూడ తమ్మును తామే పరిశుద్ధ పరచుకొనవలెనని ఆయన చెప్పాడు. నీవు దిగి వెళ్లుము, నీవును నీతో అహరోనును దిగిరావలెనని ఆయన మోషేకు చెప్పాడు. అట్లు జరిగిన తరువాత దేవుడు ఈ ఆజ్ఞలన్నియు వివరించి చెప్పాడు:

## నోటిద్వారా పలుకబడెను

"నీ దేవుడైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తు దేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని; నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందేగాని క్రింది భూమి యందేగాని భూమిక్రింద నీళ్లయందే కాని యుండు దేని రూపము నయినను విగ్రహము నయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిల పడకూడదు. వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు నన్ను ప్రేమించి నా ఆజ్ఞలను గైకొను వారిని వెయ్యి తరములవరకు కరుణించువాడనై యున్నాను.

"నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింప

కూడదు. యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరింపు వానిని నిర్దోషిగా ఎంచడు."

"విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపక ముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయ వలెను, ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను ఏ పనియు చేయకూడదు. ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి యేడవ దినమున విశ్రమించెను. అందుచేత యెహోవా విశ్రాంతి దినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను."

"నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము. నరహత్య చేయకూడదు. వ్యభిచరించకూడదు. దొంగిలకూడదు. నీ పొరుగువాని మీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు. నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు. నీ పొరుగువాని భార్యనైనను అతని దాసుడైనను అతని దాసినైనను అతని యెద్దునైనను, అతని గాడిదనైనను, నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు" (నిర్గమ 20:1-17).

## రాతిపై చెక్కబడెను

నిర్గమ కాండము 24వ అధ్యాయములో దేవుడు మోషేను మరల కొండపైకి పిలిచాడు. "నీవును అహరోనును నాదాబును అబీహును ఇశ్రాయేలీయుల పెద్దలలో డెబ్బదిమందియు యెహోవా యొద్దకు ఎక్కివచ్చి దూరమున సాగిలపడుడి" యని ఆయన చెప్పాడు (నిర్గ 24:1). "అప్పుడు యెహోవా మోషేతో ఇట్లనెను - నీవు కొండ యెక్కి నా యొద్దకు వచ్చి అచ్చటనుండుము; నీవు వారికి బోధించునట్లు నేను వ్రాసిన ఆజ్ఞలను ధర్మశాస్త్రమును రాతిపలకలను నీ

కిచ్చెదననగా మోషే దేవుని కొండమీదికి ఎక్కెను" (నిర్గ 24:12). "అప్పుడు మోషే ఆ మేఘములో ప్రవేశించి కొండమీదికి ఎక్కెను. మోషే ఆ కొండమీద రేయింబవళ్ళు నలువది దినములుండెను" అని 18వ వచనములో వ్రాయబడి యున్నది నిర్గమ 25వ అధ్యాయము నుండి 31వ అధ్యాయము వరకు, దేవుడు మోషేకు మిగిలిన ఆజ్ఞలు విధులన్నియు వివరముగా చెప్పాడు.

నిర్గమ కాండము 32వ అధ్యాయములో ఇశ్రాయేలీయులు బలవంతము చేయగా అహరోను ఒక బంగారు దూడను చేయించినట్లు ఆ దూడయే తమ్మును బానిసత్వమునుండి విడుదల చేయించిన దేవతయని వారు పూజించుచున్నట్లు చూడగలము. కొండ దిగువను యేమి జరుగుచున్నదో యెహోవా మోషేకు చెప్పాడు. వారు చేసిన పాపమునుబట్టి దేవుడు వారిని కాల్చివేసి మోషేను గొప్ప జనముగా చేసెదనని చెప్పాడు. ఇశ్రాయేలీయుల దరపున మోషే బ్రతిమ లాడగా దేవుడు తన ప్రజలకు చేసెదనని చెప్పిన కీడును గూర్చి సంతాపపడెను.

"మోషే శాసనములు గల రెండు పలకలను చేతపట్టుకొని కొండ దిగవచ్చెను. ఆ పలకలు ఇరుప్రక్కలను వ్రాయబడినవి. అవి ఈ ప్రక్కను ఆ ప్రక్కను వ్రాయబడియుండెను. ఆ పలకలు దేవుడు చేసినపని. ఆ పలక మీద చెక్కబడిన వ్రాత దేవుని చేవ్రాత" (నిర్గ 32 : 15, 16). అతడు పాళెము సమీపంగా ఆ దూడను, వారు నాట్య మాడుటను చూచి అతని కోపము మండెను. అతడు కొండ దిగువను తన చేతులలోనుండి ఆ పలకలను పడవేసి వాటిని పగుల గొట్టెను (నిర్గ 32:19).

దేవుడు మోషేకు మరి యొకసారి రెండు రాతి పలకల నిచ్చాడు. నిర్గమ 34:1లో యెహోవా మోషేతో "మొదటి పలకల వంటి మరి రెండు రాతి పలకలను చెక్కుము. నీవు పగులగొట్టిన

మొదటి పలకల మీదనున్న వాక్యములను నేను ఈ పలకల మీద వ్రాసెదనని చెప్పాడు." అతడు నలువది రేయింబవళ్లు యెహోవాతో కూడ అక్కడ ఉండెను...అంతలో ఆయన ఆ నిబంధన వాక్యములను అనగా పది ఆజ్ఞలను ఆ పలకల మీద వ్రాసెను" (నిర్గ 34:28).

గనుక ఈ రీతిగా ఈ పది ఆజ్ఞలను దేవుడు మొదట నోటితోనే చెప్పాడు. తరువాత వాటిని రెండు రాతి పలకల మీద చెక్కాడు. అవి పగులగొట్టబడగా మరి రెండు రాతి పలకలమీద ఆయన వాటిని వ్రాసి యిచ్చాడని గ్రహించుకోగలము. దేవునిచే వ్రాయబడిన ఆజ్ఞలు గనుక ఈ పది యాజ్ఞలు ఇశ్రాయేలు దేశములో గొప్ప ప్రాముఖ్యత వహించాయి. నేటి మానవుని నైతిక వర్తనము కూడ చాలమట్టుకు ఈ పది యాజ్ఞల మీదనే ఆధారపడియున్నది.

యేసు ప్రభువు ఈ లోకానికి వచ్చి వాటిలో నిగూఢమైన భావాలను వెలితీసి మానవులకు బోధించాడు. దైవిక జ్ఞానాన్ని బట్టి పది యాజ్ఞలన్నిటి సారాంశాన్ని ఆయన ఇట్లు క్రోడీకరించాడు: ధర్మ శాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ నీ పూర్ణాత్మతోను, నీపూర్ణ హృదయముతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే (మత్త 22:37-39).

క్రొత్త నిబంధనలో మానవుడు నూతన జీవితం జీవించే మార్గాన్ని యేసుప్రభువు బయలుపరచాడు. ఆయన శాసనము రాతి పలకలమీద గాక మాంసపు గుండెమీద వ్రాయబడాలి (యిర్మీ 31:31-34). ఈ పది యాజ్ఞల వెనుకయున్న గొప్ప ఆత్మీయ సూత్రాలు క్రొత్త నిబంధనలో ఎంత లోతుగా బలంగా యున్నాయో తెలుసుకోవచ్చును.

(సత్యవాణి రేడియో ప్రసంగమాలిక నుండి సేకరణ)

క్రైస్తవ కీర్తనల పుస్తకము తిరిగి ముద్రించబడి ఇప్పుడు మావద్ద దొరుకుచున్నది. కొన్ని క్రొత్త కీర్తనలు చేర్చబడి అందముగా బైండింగ్ చేయబడినది. పుస్తకము ఖరీదు రూ **6/-** మాత్రమే. ఆర్డినరీ పోస్టేజి 0-50 పైసలు అదనం. వలయు వారు ఈ దిగువ చిరునామాకు M. O. పంపి పొందండి.

**SATYAVANI, P.O. Box 80, KAKINADA.**

Regd. No. H/KD—45/KD.H.O

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA 533 001

No.

To
..............................
..............................
..............................
..............................